క్లుప్తంగా

ఫ్లెక్సీల ముద్రణలో నిబంధనలు పాటించాలి



ఫ్లెక్స్ ప్రింటర్స్ యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్

నరసాపురం: ఫ్లెక్సీలు, బ్యానర్స్ ముద్రణలో ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం కమిషనర్ తన చాంబర్‌లో పింటింగ్ ప్రెస్‌ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరికొద్దిరోజుల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రాబోతుందని అన్నారు. ఇప్పటి నుంచే ఎన్నికల నియమావళికి సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కచ్చితంగా ఫ్లెక్సీలపై ఫోన్ నెంబర్లు ముద్రించాలని చెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తారని వివరించారు.

ఆకట్టుకున్న ట్రాక్టర్ల ర్యాలీ



కొడమంచిలిలో ఆకట్టుకొన్న ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల శంఖారావం సందర్భంగా కొడమంచిలిలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు మద్దతుగా వైఎస్సార్ సీపీ విజయం కోసం నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీ ఆకట్టుకొంది. గురువారం మధ్యాహ్నం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వర కూ కొడమంచిలి గ్రామ వీధుల్లో మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

18 నుంచి ఒంటి పూట బడులు

పాలకోడేరు: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి ఒంటిపూట బడుల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి 1 పెనుమత్స వెంకట శివ నాగరాజు తెలిపారు .ఈనెల 18 నుంచి ఉదయం 7.45 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆరు బయట, చెట్ల కింద తరగతులు నిర్వహించవద్దని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నట్టు ఆయన తెలిపారు.. ఏప్రిల్23 వరకు ఈ ఒంటి పూట బడులు కొనసాగుతాయని తెలిపారు.

దళితుల అభ్యున్నతికి కృషి చేయాలి

వీరవాసరం: దళితుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గుండె నగేష్ బాబు కోరారు. వీరవాసరం మండలం తోలేరు గ్రామంలో మాల మహానాడు భీమవరం నియోజకవర్గ కార్యదర్శి సరెళ్ళ పృథ్వీ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీ అయినా దళితులకు అండగా ఉండి ,దళితులకు రావాల్సి రాయితీలను 100 శాతం ఇస్తామని, ఆ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన వారికే మాల మహానాడు మద్దతుగా ఉంటుందని తెలిపారు. సరెళ్ళ శ్రీనివాస్, వర్ధనకు మోషే పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఉండి: మండలంలోని యండగండి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దోపిడీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ముదునూరి కృష్ణచైతన్య ముత్యాలరాజుకు అమెరికాకు వెళ్లాడు.దీంతో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ఇంటికి తాళం వేశారు. అయితే గురువారం ఉదయం 7 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తుల ఇంట్లోకి చొరబడి ఇంట్లోని రూ.5 వేల విలువైన వెండి వస్తువులు, రూ.8 వేల నగదు, 4 గ్రాముల బంగారు వస్తువులు దోచుకుని వెళ్లినట్లు కుటుంబ సభ్యుడు రామరాజు(రాంబాబు) గురువారం పోలీసులను ఆశ్రయించాడు. అతని ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల శిక్షణను విజయవంతం చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): నియోజకవర్గ స్థాయిలో జరిగే ఎన్నికల శిక్షణ తరగతులకు సెక్టారు అధికారులు, అసెంబ్లీ లెవెల్ మాస్టార్ ట్రైనర్లు అత్యంత బాధ్యత తీసుకుని విజయవంతం చేయాలని జిల్లా జాయింటు కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు .గురువారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో ఉండి నియోజక వర్గం సెక్టారు అధికారులు, అసెంబ్లీ లెవెల్ మాస్టారు ట్రైనర్లుకు ఎన్నికల శిక్షణ తరగతులను జిల్లా జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గానికి సంబంధించి ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15, 16 తేదీలలో జరిగే నియోజక వర్గ స్థాయిలో జరిగే ఎన్నికల శిక్షణా తరగతులు విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో అవగాహన పొందాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



సమావేశంలో వైఎస్ రాజశేఖరరెడ్డికి ప్రతిమకు నివాళులర్పిస్తున్న నాయకులు



సమావేశానికి భారీ సంఖ్యలో హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

నరసాపురం: పార్టీ కార్యకర్తల సంక్షేమ కోసం వారి బాగోగుల కోసం అహరం శ్రమిస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారంస్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నరసాపురం నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంలో కార్యకర్తలు చేసిన కృషి ఎనలేనిదన్నారు. మళ్లీ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి రాబోతున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలపించాలని సూచించారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అన్నారు. నరసాపురం నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త తన గుండెల్లో ఉంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన స్వర్ణయుగాన్ని తలపించిందన్నారు. కులం, మతం, చివరకు పార్టీలు కూడా చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. మరోవైపు అభివృద్ధికి కూడా సమాంతరంగా ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. నరసాపురంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వశిష్టవంతెన, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ వంటి ప్రాజెక్ట్‌లను పట్టాలెక్కించామని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధిపరంపర కొనసాగాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని చెప్పారు.

జగన్‌ను ఓడించడానికి ముగ్గురు ఏకం

సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను చేరువ చేసి, వలంటీర్ల ద్వారా ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడానికి ప్రతిపక్ష పార్టీలు మూడూ ఏకమై వస్తున్నాయని పార్టీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల అన్నారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, మత్స్యకార సొసైటీల సంఘం జిల్లా అధ్యక్షుడు అంగ్రాజు చల్లారావు, పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కామన బుజ్జి, సీనియర్ నేతలు షేక్ బులిమస్తాన్, వైకేఎస్, పప్పుల రామారావు, చాగంటి సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ ఇంజేటి జాన్ కెనడీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బర్రి శంకరం, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బి.పూర్ణ, మావూరి సత్యనారాయణ, అయితం ధనలక్ష్మి, నల్లిమిల్లి జోసఫ్, జడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు



ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా ముదస్తు చర్యలు చేపట్టామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం ముదునూరి 30వవార్డులో రూ 3.50 లక్షలతో నిర్మించిన ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ఎక్కడా మంచినీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. పట్టణంలో కుళాయిల ద్వారా రెండు పూటలా మంచినీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు అడిదల శ్యామల, అడిదల శరత్, ముదునూరి కుమారుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

మొగల్తూరు: సొంతింటి కలను సాకారం చేసే విధంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లబ్ధిదారులంతా రుణ పడి ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కర్రి ఏసుబాబు కోరారు.గురువారం మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలోని లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పతకంలో భాగంగా 15మంది లబ్ధిదారులకు యాజమాన్య ఆస్తి ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నామన్నారు. కులమతాలకతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓసూరి విజ్జిబాబు, పోతుల రమేష్, ఎంపీటీసీ సభ్యుడు అంగ్రాజు షరాబంద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజ వేయాలి

పెనుగొండ: మహిళలు వారి బలాన్ని గుర్తించి విద్య, ఉద్యోగ, రాజకీయ సాంకేతిక రంగాల్లో ముందంజ వేయాలని వడలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిషు సీనియర్ టీచర్ జి.నాన్సీ అన్నారు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో పాల్గొని మాట్లాడారు. బాలికలందరూ ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత స్థితికి చేరాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం బొచ్చు లక్ష్మీ నరసింహమూర్తి, కె.వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్ల ఆగడాలపై ఆక్వా రైతుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వా రైతులు

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతుల పట్ల ప్రాసెసింగ్ ప్లాంట్ సంఘాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం స్థానిక ఎస్ఎస్ఎస్ ల్యాణ మండపంలో ఆక్వా రైతుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గాంధీరాజు మాట్లాడుతూ గతంలో రాష్ట్ర అప్సా సంఘం వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ ఆధ్వర్యంలో ప్రాసెసింగ్ ప్లాంట్ సంఘ సభ్యులతో చర్చలు జరిపామన్నారు. ఆ చర్చల్లో ప్లాంట్ సంఘ సభ్యులు ఆక్వా ధరలు తగ్గించినప్పుడు అలాగే మరిన్ని విషయాలపై చర్చించినప్పుడు రైతు సంఘాలకు పది రోజులు ముందగా సమాచారం ఇస్తానని చెప్పారన్నారు. నాడు సరేనన్న ప్లాంట్ సభ్యులు నేడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ధరల్లో కేజీకి రూ. 50లు తగ్గించారన్నారు. ధరలు తగ్గించి వారం రోజులైనా రైతు సంఘాలకు సమాచారం లేదన్నారు. ఇలా ఆక్వా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్లాంట్ సంఘాల సభ్యులు ఈ నెల 18 లోపు ఇచ్చిన మాట ప్రకారం సమాధానం చెప్పాలన్నారు. లేని పక్షంలో మార్చి 23న జిల్లా వ్యాప్తంగా 25 వేల మంది ఆక్వా రైతులతో ప్రాసెసింగ్ ప్లాంట్‌లపై నిరసనగా చలో భీమవరం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోణం చినబాబు, ఆర్.సత్యనారాయణరాజు, జాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రముఖిని తరిమికొడతారు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



కొడమంచిలిలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పెనుమంట్ర: సాయినాథ కల్యాణమండపంలో మాట్లాడుతున్న రంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో చంద్రముఖి, టీడీపీ నాయకులు పగటి కలలను కంటున్నారని, వారిని ప్రజలు తరమి కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం ఆచంట మండలం కొడమంచిలి, పెదమల్లంలో ఎన్నికల శంఖారావం నిర్వహించారు. సీఎం జగన్ అమలు పరిచిన సంక్షేమం, నియోజకవర్గంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజులు చేపట్టిన అభివృద్ధి పథకాలు అండగా నిలిచి విజయానికి బాటలు వేస్తాయని ప్రజలు హారతులు పట్టారు. కార్యక్రమంలో పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, ఏఎంసీ చైర్‌పర్సన్ చిల్లే లావణ్య, మాజీ చైర్‌పర్సన్ సుంకర ఇందిర సీతారాం, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, కార్పొరేషన్ల డైరెక్టర్లు బొక్కా అరుణ, అందే నాగ బసవన్న, మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజు పరామర్శ

అనారోగ్యానికి గురైన పెనుగొండ మండల సేవాదళ్ మండల కన్వీనరు బాలం సత్తిరాజు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. గురువారం పెనుగొండలో సత్తిరాజు నివాసంలో కలిసి ఆరోగ్యం పై ఆరా తీసి భీమవరం ఆసుపత్రికి సత్వరం వెళ్లాల్సిందిగా సూచించారు. వైద్యులతో సంప్రదించి మెరుగైన వైద్యం అందే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), మండల కన్వీనరు నల్లిమిల్లి బాబిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్‌కుమార్, పార్టీ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, గుడాల దుర్గారావు, తవిటికి సత్యనారాయణ, పిల్లి నాగన్న, గుడాల ఏసు, వేండ్ర లీలా వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యం

పెనుమంట్ర: రాష్ట్రం అన్ని విధాలా మరింత అభివృద్ధి చెందాలన్నా సంక్షేమ పథకాలు యథావిధిగా అమలు చేయాలన్నా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యపడుతుందని మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం పెనుమంట్రలోని శ్రీసాయినాథ కల్యాణ మండపంలో జరిగిన జగనన్న కాలనీల ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తాడిపత్రి ప్రియాంక అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వం ఆచంట నియోజకవర్గంలో ఇళ్ల స్థల పట్టాలకు సెంటు భూమి కూడా పేదలకు ఇవ్వలేదు సరికదా నేడు పెనుమంట్రలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే మాజీ మంత్రి పితాని సత్యనారాయణ కులాలను, కమ్యునిస్టులను రెచ్చగొట్టి వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుతగులుతున్నారన్నారు. తాను అత్తిలి ఎమ్మెల్యేగా ఉండగా పెనుమంట్ర మండలంలో 14 గ్రామాల్లో అర్హులకు ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చామని పెనుమంట్రలో రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా తాను ఇప్పించిన పట్టాలను సైతం పితాని తన అనుచరులు పట్టాలు తారుమారు చేసి అమ్ముకుని లబ్ధిదారులను దోచుకున్నాడని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా మండలంలో 2035 మందికి డాక్యుమెంట్లు ఇవ్వాల్సి ఉండగా 2203 మంది లబ్ధిదారులకు సభలోనే డాక్యుమెంట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, పెనుగొండ ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, రాష్ట్ర విద్యామౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవ్‌రెడ్డి, మండల పరిషత్ 1, 2 ఉపాధ్యక్షులు వాసంశెట్టి కిరణ్, ఈది అనిత, మండల పార్టీ అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు, పెనుమంట్ర ఎంపీటీసీ సభ్యుడు గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెనుమంట్ర గరువు పంచాయితీ పరిధిలోని జగనన్న కాలనీ సాంబయ్య చెరువు గట్టు ప్రాంతాల్లో రూ.40 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణం గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో ఎంతో కాలంగా అపరిశుభ్రంగా ఉన్న సాంబయ్య చెరువుగట్టు రోడ్డును నిర్మించనున్నారు. గ్రామ సర్పంచ్ ముదునూరి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



యలమంచిలి: కట్టుపాలెంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గుడాల గోపి



పోడూరు: యువతకు క్రికెట్ కిట్‌లు అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

యలమంచిలి: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో గ్రామం , పట్టణం, నగరం అని తేడా లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. కట్టుపాలెం గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మిస్తున్న రెండు సిమెంట్ రోడ్లకు గురువారం గోపి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను జోడు గుర్రాల్లా పరుగు పెట్టించిన ఘనత జగనన్నది అన్నారు. అవినీతి, సిఫారసులకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అందించామన్నారు. మళ్లీ ఈ పథకాలన్నీ అందుకోవాలంటే ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి జగనన్నకు ముఖ్యమంత్రిగా మరో అవకాశం కల్పించాలని గోపి కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నమండ నాగరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు, జేసీఎస్ పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్, మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కల్యాణం గంగాధరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఒడుగు హనుమంతరావు, పెచ్చెట్టి రాంబాబు, తిరుమాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి

పోడూరు: క్రీడల అభివృద్ధికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి అన్నారు. మండలంలోని వద్దిపర్రు, రావిపాడు, పెనుమదం గ్రామాలకు చెందిన యువతకు గురువారం ఆయన క్రికెట్ కిట్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందనీ, క్రీడలను అలవర్చుకోవడం ద్వారా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చేవారికి మంచి భవిష్యత్తు ఉంటుందనీ, ప్రభుత్వ ఉద్యోగాలు కూడా సులువుగా వస్తాయన్నారు. కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు చదువుతో పాటు క్రీడానైపుణ్యాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. వడ్లపాటి సురేష్, దేవ రాజేష్, వడ్లపాటి ఆనందరాజు, కొల్లాబత్తుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు పట్టణ మార్కెట్ ఆశీల వేలం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మునిసిపల్ కార్యాలయానికి చెందిన మార్కెట్ ఆశీల వసూళ్లలో రూ. 11.92 లక్షల ఆదాయం అధనంగా వచ్చినట్లు మునిసిపల్ కమిషనర్ విజయ సారథి తెలిపారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మార్కెట్ ఆశీలు వేలం పాటలో వీక్లీ మార్కెట్‌కు గత సంవత్సరం రూ. 17.50 లక్షలకు పాడగా 2024-2025 సంవత్సర కాలానికి రూ. 21.51 లక్షలకు వేలం దక్కించుకోగా రూ. 4.01 లక్షలు అదనంగా వచ్చింది. అలాగే డైలీ మార్కెట్ వేలం పాట గత సంవత్సరం రూ. 21.10 లక్షలకు పాడగా 2024-2025 సంవత్సర కాలానికిగాను రూ. 29.01 లక్షలకు పాడుకున్నారు. అదనంగా రూ. 7.91 వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సరం కన్నా మొత్తం రూ. 11.92 లక్షలు అధనంగా పాటలు పెరిగినట్లు కమిషనర్ తెలిపారు.

టెండర్ దశకు భారీ విద్యుత్ సబ్‌స్టేషన్

- రూ.133 కోట్లతో 220/132/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం
- రెండు మున్సిపాలిటీలు, 5 మండలాల్లో తీరనున్న లో-ఓల్టేజ్ సమస్య



నరసాపురంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

నరసాపురం: నరసాపురంలో భారీ విత్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గతంలోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మరికొన్ని రోజుల్లో పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. విద్యుత్ లోఓల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ రూ.133 కోట్లతో 10 ఎకరాల స్థలంలో 50 ఎంవీఏ సామర్థ్యంతో 220/132/11 కేవీ భారీ సామర్థ్యంతో ఈ కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించబోతోంది. ప్రభుత్వం ట్రాన్స్‌కో ద్వారా దీనికి సంబంధించి జీఓ 2368ని 2021 ఫిబ్రవరిలో విడుదల చేసింది. వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టి ఈ వేసవిలోనే పనులు పూర్తిచేయడానికి సన్నాహాలు చేపట్టింది. సబ్‌స్టేషన్ నిర్మాణానికి పట్టణంలోని రుస్తుంబాద ప్రాంతంలో 10 ఎకరాల స్థలాన్ని గతంలోనే సేకరించారు.

లో ఓల్టేజ్ సమస్యలకు చెక్

నరసాపురంలో ఇప్పటికే 132/11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్‌స్టేషన్‌లో గతంలో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. 2020లో ఆ ట్రాన్స్‌ఫార్మన్ సామర్థ్యాన్ని 80 ఎంవీఏకు పెంచారు. ఇప్పుడు అదనంగా అనుసంధానంగా మరో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న కొత్త 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ప్రస్తుతం నరసాపురం సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇందులో నరసాపురం, పాలకొల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. నరసాపురం, పాలకొల్లు రూరల్ మండలాలు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాల్లో ఎంతోకాలంగా విద్యుత్ లోఓల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఇబ్బందులు మరీ ఎక్కువగా ఉంటున్నాయి. ఇప్పుడు ఇక ఈ సమస్యకు చెక్ పడనుంది. నరసాపురం తీర ప్రాంతంతో పాటు మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లు రూరల్ మండలంల్లోని పరిసర ప్రాంతాల్లో విస్తారంగా ఆక్వాసాగవుతోంది. కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే లోఓల్టేజ్ సమస్యలు కూడా తొలగి నాణ్యమైన విద్యుత్ ఆక్వా రైతులకు కూడా సరఫరా అవుతుంది.

త్వరలో వినియోగంలోకి...



కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు త్వరగా ప్రారంభించి పూర్తిచేయించి, వినియోగంలోకి తేవాలని భావిస్తున్నాం. కొన్ని కారణాల వల్ల పనులు జాప్యం జరిగింది. కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి లోకి వస్తే లోఓల్టేజ్ సమస్యలు ఉండవు. భారీ సామర్థ్యంతో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ కట్టడం వల్ల ఇక విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉండవు.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే